# ఆత్మగౌరవం

రామదాసుకి, పౌరాణిక నాటకాలు చూడ్డమన్నా, వాటిలో వేషాలు వెయ్యడమన్నా అపరిమితమైన ఆసక్తి. చదువుకునే రోజుల్నించీ ఆ సరదా ఎక్కువే. స్వగ్రామంలో వున్న నాటక సమాజం వారితో కలిసి, పౌరాణిక నాటకాల్లో చిన్న చిన్న వేషాలు వేసేవాడు. అందుకోసం ప్రత్యేకంగా కొన్ని రాగాలు నేర్చుకున్నాడు. ఆ రంగంలో నిష్ణాతులైన వారి దగ్గర, రాగయుక్తంగా పద్యాలు ఎట్లా చదవాలో, ఆలాపన ఎలా చెయ్యాలో, అవగాహన చేసుకున్నాడు. అవగాహనతో పాటు, ఎంతో కృషి చేసేవాడు. రోజూ సాయంకాలం కాలువ గట్టుకి పోయి, ఒంటరిగా కూచుని పద్యాలు చదువుతూ, ఆత్మ సంతృప్తి పొందేవాడు. చాలా మంది స్నేహితులు అతని కంఠ మాధుర్యాన్ని రాగాలాపాన్ని బహుధా ప్రశంసించేవారు.

ఎప్పటికయినా, పౌరాణిక నాటకాల్లో ప్రముఖ పాత్రలు ధరించి ప్రజల మెప్పును పొందాలన్న కోరిక, అతని మనసులో చాలా రోజుల్నించి దాగొని వుంది.

ఈ లోగా పశ్చిమ బెంగాల్లోని సంత్రాగచీలో ఉన్న ఓ బంధువు ద్వారా అక్కడ ఒక ఉద్యోగం దొరికింది రామదాసుకి. బతకడానికి ఎక్కడైతేనేం అన్న ఉద్దేశంతో సంత్రాగచీ వెళ్ళిపోయాడు. అక్కడ తెలుగు వారి జనాభా గణనీయంగానే ఉండటం గమనించాడు. అతనికి ఎంతో ఆనందం కలిగింది. పౌరాణిక నాటకాలు వేసే సమాజం అక్కడ ఉందేమోనని వాకబు చేశాడు. అదృష్టం కొద్దీ, అటువంటి సమాజం ఒకటి ఉందని తెలిసింది. ఉపేక్షించకుండా అక్కడికి వెళ్ళాడు. ఆ సమాజంలో సభ్యుడిగా చేరాడు.

ఆ సమాజానికి, వీరయ్య మేష్టారు హార్మోనిస్టు. సభ్యులందరికీ అతనే గురువు అంచేతనే గామోసు, అందరూ అతణ్ణి 'మేష్టారు' అనే సంబోధిస్తారు. వీరయ్య ప్రతిభ గల హార్మోనిస్టే కాదు - వ్యక్తిగా చాలా మంచివాడు. ఏవో సందర్భాల్లో ఏకపాత్రాభినయాలూ, ద్విపాత్రాభినయాలు ఏర్పాటు చేస్తూ, సమాజంలోని నటులకు స్ఫూర్తిని, ప్రోత్సాహాన్ని అందిస్తూ ఉండేవాడు వీరయ్య మేష్టారు.

రామదాసు ప్రతిభను గుర్తించినవాడు వీరయ్య మేష్టారు. మంచి తర్ఫీదు ఇస్తే ప్రముఖ పాత్రలు ధరించగల సత్తా ఉన్నవాడే అనిపించిందతనికి. అయితే, రామదాసు కంటే సీనియర్లు ఆ సమయంలో వున్నారు. వారిలో అంతగా ప్రతిభ లేకపోయినా, వారిని కాదని రామదాసుకి ప్రాముఖ్యమివ్వడానికి సందేహిస్తున్నాడు వీరయ్య. నాటక సమాజాల్లో ఇటువంటివి సర్వసాధారణమే !

✪ ✪ ✪

రోజులు గడుస్తున్నాయ్!

వీరయ్య మేష్టారుకి ఓ ఆలోచన వచ్చింది. ఆంధ్ర రాష్ట్రం నుంచి పేరున్న పౌరాణిక నటుల్ని కొందర్ని రప్పించి, తను సమాజంలోని నటుల చేత చిన్న చిన్న వేషాలు వేయించి, పూర్తి స్థాయి నాటకం ఏదన్నా స్థానికంగా ప్రదర్శించాలన్న సత్సంకల్పం అది. టిక్కెట్టు పెట్టి నాటకం వేయిస్తే ఖర్చులు వచ్చేస్తాయన్న నమ్మకం అతనికుంది. ఓ మంచి పౌరాణిక నాటకాన్ని ఇతర భాషల వారికీ చూపించాలన్న అభిలాష అతనికి ఎప్పట్నుంచో ఉంది. దాన్ని కార్యరూపంలో పెట్టాలనుకున్నాడు. ఓ రోజు, తన అభిలాషని సభ్యుల ముందుంచాడు వీరయ్య.

మేష్టారి ఆలోచన్ని, అభిలాషని, సభ్యులందరూ హర్షించారు. 'ఆలోచన బాగానే వుంది మేష్టారూ! ఇంతకీ ఎంతమంది నటుల్ని మన రాష్ట్రం నుంచి రప్పించాలనుకుంటున్నారు ? ఏ నాటకం ప్రదర్శించాలని మీ అభిప్రాయం ?" ప్రశ్నలు వేశాడు రాంబాబు.

రాంబాబు ఆ సమాజంలో ఓ సీనియర్ మెంబరు. కాస్త డబ్బున్నవాడు. రైల్వే ఉద్యోగులకు అప్పులిచ్చి, భారీగా వడ్డీ డబ్బులు గుంజి, బాగా సంపాదించాడు. ఉద్యోగానికి క్రమపద్ధతిలో వెళ్ళడు. అతనికి తీరిక ఉన్నప్పుడు వెళ్తూ వుంటారు. అయినా, హాజరు మాత్రం నడిచిపోతూ వుంటుంది. అటువంటి ఏర్పాట్లు చేసుకున్నాడు. కాసుకి దాసులు కాని వాళ్ళెవ్వరు ? రాంబాబు వేసిన ప్రశ్నలకు వీరయ్య మేష్టారు బాధపళ్ళేదు.

"నా అభిప్రాయంలో శ్రీ కృష్ణ రాయభారం.. నాటకం వేస్తేనే మంచిదనిపిస్తుంది..." అన్నాడు వీరయ్య

"ఔను మేష్టారు ! అదే నా దృష్టిలోనూ వుంది" అన్నాడు రాంబాబు.

మిగతా సభ్యులు ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. వీరయ్య మేష్టారుకి తెలుసు - మిగిలిన సభ్యులు మాట్లాడరని.

"ఆ నాటకంలో శ్రీకృష్ణ, అర్జున, భీమ, కర్ణుడు పాత్రలకు కిరాయి నటుల్ని రప్పించాలనుకుంటున్నాను. మీరేమంటారు? అందర్నీ ఉద్దేశించి అన్నాడు వీరయ్య.

"మిగిలిన వేషాలు, మనవాళ్ళు వేస్తారా?" మళ్ళీ రాంబాబే ప్రశ్నించాడు.

"ఔను రాంబాబుగారూ! మిగిలిన వేషాలు, మీరంతా వేస్తారు ..."

"ఎవరెవరు ఏ వేషం వేస్తారో అదీ చెప్పేయండి మేష్టారూ..." అన్నాడు రాంబాబు.

మిగతా ఎవ్వరూ మాట్లాడకపోవడం, వీరయ్యకి ఇబ్బందిగానే ఉంది. వీరయ్య మేష్టారు చప్పున చెప్పలేక, సందిగ్ధంలో పడ్డాడు.

"మేష్టారూ, నేనొక్క విషయం చెప్పనా?" వీరయ్య మేష్టారి ఆలోచల్ని ఛేదిస్తూ అన్నాడు రాంబాబు.

"చెప్పండి..." ముక్తసరిగా అన్నాడు వీరయ్య.

"మేష్టారూ, మాలో సీనియార్టీని కూడా కాస్త దృష్టిలో పెట్టుకుని మరీ నిర్ణయించండి. మీ నిర్ణయానికి తిరుగుండదు" అన్నాడు రాంబాబు.

మిగతా వారిలో ఇద్దరు ముగ్గురు రాంబాబుకి వత్తాసు పలికారు.

వీరయ్య మేష్టారు ఇరకాటంలో పడ్డారు. వాళ్ళ మాటల్లోని అంతరార్థం, ఇప్పుడతనికి అవగతమయ్యింది. రామదాసుకి, తను మంచి వేషం ఇచ్చేస్తాడేమోనన్న వారి దుగ్దని అర్థం చేసుకున్నాడు. రామదాసు, వాళ్ళందరికంటే మంచి నటుడని, హృద్యంగా పద్యం చదవగల ప్రతిభావంతుడని, వాళ్ళకీ తెలుసు. కాని అసూయ వారి చేత ఆ మాటలనిపించిందనుకున్నాడు. అనవసరంగా తను వివాదంలోకి దిగకూడదనుకున్నాడు.

"మీ అభిమతమే నా అభిమతం, రాంబాబు ధర్మరాజుగా, ప్రకాశం భీష్ముడుగా, రాజారావు ధృతరాష్ట్రునిగా, గోపాలం అశ్వత్థామగా, రామారావు ద్రోణుడుగా, మూర్తి సహదేవుడుగా, రామదాసు నకులుడుగా నటిస్తారు. ఇకపోతే ద్రౌపది పాత్ర ఓ అందమైన అబ్బాయి ఎవరన్నా వుంటే వేయించేద్దాం" అంటూ వివరంగా చెప్పాడు వీరయ్య.

అందరూ ఆనందించారు. ముఖ్యంగా రాంబాబు మురిసిపోయాడు - తనకీ ఓమంచి పాత్ర లభించినందుకు. రామదాసు తనకి చిన్న పాత్ర లభించినందుకు బాధపళ్ళేదు. అతనికి తెలుసు - వీరయ్య మేష్టారు ఎటువంటి సందిగ్ధావస్థలో వున్నారో! ఆ చిన్న పాత్రలోనే తన ప్రతిభ నిరూపించుకోవాలనుకున్నాడు.

"మీ నిర్ణయం బావుంది మేష్టారూ! మీరు ఎవరెవర్ని ఏయే పాత్రలకు మన రాష్ట్రం నుంచి రప్పించాలనుకుంటున్నారో ఇప్పట్నుంచే ప్రయత్నాలు ప్రారంభించండి. హాలు బుక్ చేసుకోవడం, టిక్కెట్లు ప్రింటు చేయించడం, వాటిని అమ్మడం, ఇవన్నీ ఉన్నాయి. ఇది అందరి బాధ్యత"... రాంబాబు అందర్నీ ఉద్దేశించి అన్నాడు... అతను ఆ సమాజానికి కార్యదర్శి గాబట్టి.

"అందరం కష్టపడి పనిచేద్దాం!" సభ్యులంతా ముక్తకంఠంతో అన్నారు.

ఎల్లుండి ఆదివారం కాబట్టి మళ్ళీ మనందరం ఇక్కడే కలుసుకుందా. ఆ రోజు అన్ని విషయా కూలంకషంగా మాట్లాడుకుందాం" అన్నడు వీరయ్య.

ఆ రోజుసమావేశం అలా ముగిసింది.

✪✪✪

ఆదివారం నాడు మళ్ళీ సభ్యులందరూ కలుసుకున్నారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి ఎవరెవర్ని ఏయే పాత్రలకు తీసుకురావాలో నిర్ణయించుకున్నారు వాళ్ళని రప్పించే బాధ్యతను వీరయ్య మేష్టారుకే అప్పగించారు. అంతా.. మిగిలిన పనుల్ని కార్యదర్శి రాంబాబు, మిగతా సభ్యులూ నిర్వహిస్తామన్నారు. "పట్టుదలతో మనందరం కలిసికట్టుగా పనిచేస్తే, మన ఈ ప్రయత్నం విజయవంతమౌతుంది. అందులో సందేహంలేదు" అన్నాడు వీరయ్య. అలాగే చేద్దాం మేష్టారూ" అందరూ ముక్తకంఠంతో అన్నారు.

వీరయ్య మేష్టారు ఎంతో ఆనందించాడు. ఆ రోజుకి సమావేశం ముగిసింది.

✪✪✪

సంత్రాంగచీకి చుట్టుపక్కలున్న కలకత్తా షాలీమార్, సంక్లేయర్ మొదలగు ప్రాంతాల్లో తెలుగు వారు ఉండటం వల్ల నాటకానికి టిక్కెట్లు బాగానే అమ్ముడుపోతున్నై ప్రముఖ పాత్రల్లో ఆంధ్ర దేశం నుంచి వస్తొన్న ప్రఖ్యాత  పౌరాణిక నటుల్ని చూడాలన్న ఆకాంక్షతో చాలా మంది వృద్ధులు, మధ్య వయస్కులు టిక్కెట్లు కొంటున్నారు. యువతరం మాత్రం అంత ఆసక్తిగా ముందుకి రావడంలేద. అయినా కొందరు, ఎప్పుడూ చూడని ఆ పౌరాణిక నాటకం ఎలా ఉంటుందోనన్న జిజ్ఞాసతోఎ టిక్కెట్లు కొంటున్నారు. మొత్తానికి బాగానే అమ్ముడుపోయినయ్.

✪✪✪

నాటకం ప్రదర్శన రోజు, రానే వచ్చింది. హాలు, కిక్కిరిసి వుంది. నాటకం రసవత్తరంగా

సాగిపోతోంది. ఆంధ్ర రాష్ట్రం నుంచి తీసుకురాబడ్డ కిరాయి నటుల నటన, పద్యపఠనం, రాగాలాపన ప్రేక్షకుల్ని ఉర్రూతలూగిస్తున్నయ్. స్థానిక నటులు కూడా పరవాలేదనిపించేలా నటిస్తున్నారు. అయితే, కిరాయి నటులు మాత్రం, స్థానిక నటుల్ని మరీ చిన్నచూపు చూస్తూ ప్రవర్తిస్తున్నారు. స్థానిక నటులు పద్యాలు చదువుతున్నప్పుడు, అదోలా నవ్వుతూ, రాగాలాపాన చెయ్యనివ్వకుండానే సంభాషణ అందుకుంటున్నారు. స్థానిక నటులకు ఇది నిరుత్సాహాన్ని కలిగిస్తోంది.

కృష్ణ పాత్రధారయితే మరీనూ, స్థానిక నటులు ఆయన దృష్టిలో నటులు కారనిపించేట్టు ఉందతని ప్రవర్తన. ఆయన గొప్ప నటుడే! కాదని ఎవ్వరూ అనరు. అనుభవజ్ఞుడు, అతని పద్యాల కోసం ప్రేక్షకులు ఎదుచూస్తుంటారు. 'వన్స్‌మోర్'లు కొడుతూ వుంటారు. అయితే, కొత్త నటుల్ని గౌరవించే గుణం గాని, వాళ్ళని ప్రోత్సహించే సహృదయత గాని అతనిలో లోపించినట్టే మొదట్నుంచీ అనిపించిందందరికీ. వీరయ్య మేష్టారు కించిత్ బాధపడ్డాడు. కానీ అప్పుడేం చెయ్యగలడు?

కౌరవుల వద్దకు రాయబారానికి వెళ్ళే ముందు, శ్రీకృష్ణుడు పాండవుల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకునే ఘట్టం అది. ఆ నాటకంలో అదో రసవత్తర ఘట్టం. ధర్మరాజు పాత్రధారి రాంబాబు పద్యాల్ని మధ్యలోనే తుంచేసి,అతని అభిప్రాయాన్ని రాబట్టుకుంటున్నాడు శ్రీకృష్ణ పాత్రధారి. కిరాయి నటులు భీమార్జునుల ఉద్దేశాల్ని సొంతం వింటున్నాడు... ధర్మరాజు పాత్రధారి రాంబాబుకి, కాస్తంత కోపం వచ్చింది కానీ, రంగస్థలం మీద ఏం చెయ్యగలడు? ఓర్పు వహించి ఊరుకున్నాడు.

నకుల, సహదేవుల వంతు వచ్చింది. వాళ్ళిద్దరూ తమ ప్రతిభ ప్రేక్షకులకు తెలియజేయాలన్న ఆకాంక్షతో వున్నారు.

ముఖ్యంగా రామదాసు, మరీ పట్టుదలతో వున్నాడు. తనకున్న రెండు సంభాషణలు చెప్పి, ఒకే ఒక్క పద్యం హృద్యంగా చదివి, ప్రేక్షకుల మెచ్చే విధంగా రాగాలోపన చేసి పౌరాణిక నాటక రంగంలో నిష్ణాతులైన కిరాయి నటుల ప్రోత్సాహం పొందాలని, వారిచేత శభాష్ అనిపించుకోవాలని, ఉవ్విళ్ళూరుతున్నాడు. అయితే, శ్రీకృష్ణ పాత్రధారి అతనికి ఆ అవకాశాన్ని ఇవ్వలేదు.

"బావా నకులా! నీవునూ నీ అగ్రజులు చెప్పిన దాన్నే చెప్పదల్చు కున్నావనుకుంటాను. నీ మాటగా అదే చెబుతాను"' అని రామదాసు భుజం తట్టి సహదేవుడి దగ్గరికి ద్రౌపది దగ్గరికి వెళ్ళి అదే వాక్యాన్ని కొద్దిపాటి మార్పులతో చెప్పాడు.

నకుల, సహదేవ పాత్రధారులు, ఊహించని ఈ పరిణామానికి నివ్వెరబోయి, గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయారు. ముఖ్యంగా నకుల పాత్రధారి రామదాసుకి మతిపోయినట్టనిపించింది.

అతనిలో నిరాశ, నిస్పృహలు అలముకున్నాయి. తన కలలన్నీ కల్లలయ్యాయని లోలోన మథన పడ్డాడు. శ్రీకృష్ణ పాత్రధారి పై వల్లమాలిన కోపం వచ్చింది. కానీ, ఏం చెయ్యగలడు? శిలా ప్రతిమలా ఉండిపోయాడు.

ఆ ఘట్టం తర్వాత ఎలాగూ పోర్షన్ లేదు. గాబట్టి, వేషం విప్పేశాడు రామదాసు. సహదేవుని పాత్రధారీ ఆ పనే చేశాడు. అయితే, రామదాసు బాధపడినంతగా అతను ఆవేదన చెందలేదు.

నాటకం ముగిసింది కొంతసేపటికి.

✪ ✪ ✪

మర్నాడు కిరాయి నటులతో పాటు స్థానిక నటులందర్నీ సమాజం రూమ్‌లో తేనీటి విందుకు ఆహ్వానించాడు వీరయ్య మేష్టారు. మిగతా వారి విషయం ఎలావున్నా రామదాసుకి తన ప్రతిభ చూపించుకునే అవకాశం దొరకనందుకు, వీరయ్య మేష్టారు ఎంతో బాధపడ్డాడు. శ్రీకృష్ణ పాత్రధారితో ఓ మాట అన్నాడు.

"మీరు నకులుడికి ఓ అవకాశాన్ని ఇచ్చి వుండాల్సిందండీ. అతని గురించే ప్రత్యేకంగా ఎందుకు అంటున్నానంటే, సంభాషణలు చెప్పడంలోనూ, పద్యం చదవడంలోనూ అతనికి మంచి నేర్పు వుంది. వినసొంపైన గాత్రం... రాగాలాపన అద్భుతంగా ఉంటుంది" అని.

వీరయ్య మేష్టారంటే శ్రీకృష్ణ పాత్రధారికీ గౌరవ ప్రపత్తులున్నాయి.

"ఈ విషయం నాకు ముందుగా తెలీదండీ.. నిజానికి స్థానిక నటులంటే మాకు భయం మేష్టారూ. సరిగ్గా పోర్షన్లు చెప్పరు. ఒక్కోసారి వాళ్ళు పద్య చరణాల్ని మర్చిపోయిన సంఘటనలున్నాయండి. అందుకనే, అటువంటి పరిస్థితుల్నించి తప్పించుకోడానికే అలా ప్రవర్తించాల్సి వచ్చింది. అంతే గాని వాళ్ళ మీద మాకేం కోపం గాని, చిన్నచూపు గాని లేదండీ!! తనని తాను సమర్థించుకున్నాడు శ్రీకృష్ణ పాత్రధారి. "ఇక్కడి పరిస్థితి వేరండీ!" వీరయ్య మేష్టారు అన్నాడు.

"అలాగా! ఏదీ, ఆ అబ్బాయిని ఓ పద్యం చదవమనండి..." అన్నాడు శ్రీకృష్ణ పాత్రధారి.

వీరయ్య మేష్టారు హార్మోనియం ముందు కూచుని "రామదాసూ ఓ పద్యం చదవండి"

రాందాసుకి అదో సదవకాశంగా తోచింది. తన ప్రతిభ చూపించుకోడానిక్కాదు - తన అసంతృప్తిని, ఆక్రోశాన్ని వ్యక్తపర్చుకుందుకు.

"వద్దులెండి మేష్టారూ ! మీరు నన్ను క్షమించాలి, మీ మాట కాదన్నందుకు. అవకాశాలు వస్తేనే

కదండీ, ఎవరి ప్రతిభ అయినా బైటపడ్డానికి ! ఎంత గొప్పవారైనా, ఎంత పేరున్న నటులైనా, తోటి నటుల్ని ప్రోత్సహించాలన్న సరసత, సహృదయత లేకపోతే వారి గొప్పతనం ఎందుకు చెప్పండి? అటువంటి వారు నిజమైన కళాకారులనిపించుకోరు. కేవలం కిరాయి నటులు గానే మిగిలిపోతారు" అన్నాడు రామదాసు. అతని మనస్సు ఎంత క్షోభించిందో అతని కళ్ళల్లో తారాడుతున్న అశ్రు బిందువులే సాక్ష్యం!

శ్రీకృష్ణ పాత్రధారితో పాటు అతనితో వచ్చిన మిగిలిన కిరాయి నటుల మొహాలూ వాడిపోయినై. వీరయ్య మేష్టారు, రామదాసు అన్నందుకు బాధపళ్లేదు. పైగా సంతోషించాడు. స్థానిక నటులందరూ రామదాసు ధైర్యాన్ని మెచ్చుకున్నారు.

శ్రీకృష్ణపాత్రధారి, తప్పుకున్నాడు. తాను చేసింది తప్పని అతనికి తెలుసు. అలాగని, ఆ నిజాన్ని ఒప్పుకోలేకగా, "అదేం కాదండీ! నా ఉద్దేశం..." అంటూ ఇంకేదో చెప్పబోయాడు శ్రీకృష్ణపాత్రధారి.

"మరేమీ చెప్పకండి సార్! నిన్నటివరకూ మీ పట్ల నాకెంతో గౌరవం, పూజ్యభావం ఉండేది. రాత్రి నాటకం తర్వాత అది నాలో నశించింది. అసలు ఎవ్వరూ గొప్పవాళ్ళు కారండీ. ఎవరికయినా, ఏ రంగంలోనైనా తగిన అవకాశాలు లభిస్తేనే, వారి ప్రతిభ విశేషాలు బైటపడి, వారు గొప్పవారు కావడానికి సోపానాలు ఏర్పడతాయి. ఈ నిజం మీకు తెలీంది కాదు.మీ లాంటి వారు కొత్తవారి అభివృద్ధికి తోడ్పడాలి గాని, వారిని అథః పాతాళానికి తొక్కేందుకు ప్రయత్నించకూడదు., దయచేసి ఇక ముందయినా ఇలా ప్రవర్తించకండి..." అంటూ లేచి

"మాష్టారూ వస్తానండీ" అని వీరయ్య మాష్టారుకి చెప్పి, నిష్క్రమించాడు రామదాసు.

శ్రీకృష్ణ పాత్రధారి తెల్లబోయాడు. వీరయ్య మాష్టారు బరువుగా ఓ నిట్టూర్పు విడిచాడు. రామదాసు ఆత్మ గౌరవాన్ని అభినందించకుండా ఉండలేకపోయాడు మనసులో.

□□□

(ఈనాడు ఆదివారం 27-10-96)